ఎంపీ వద్దిరాజుకు నామా శుభాకాంక్షలు

ఖమ్మం వ్యవసాయం, జూన్ 24: రాజ్యసభలో బీఆర్ఎస్ డిప్యూటీ లీడర్‌గా నియమితులైన ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ లీడర్‌గా మరింత చైతన్యవంతమైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

పద్మశ్రీ రామచంద్రయ్య మృతికి నామా సంతాపం

ఖమ్మం వ్యవసాయం, జూన్ 24: డోలు వాయిద్య కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిని రామచంద్రయ్య మృతిపట్ల మాజీ ఎంపీ నామా నాగేశ్వర రావు సోమవారం సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

'వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి'

ఖమ్మం రూరల్, జూన్ 24: వానకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బెల్లం ఉమ కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన సర్వ సభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని, స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని సూచించారు. కాగా, ప్రస్తుత పాలకవర్గానికి ఇదే చివరి సమావేశం కావడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. అనంతరం అధికారులతో కలిసి ఎంపీపీ ఆయా శాఖల పురోగతిపై సమీక్షించారు.

'విద్యా ప్రమాణాల పెరుగుదలకు కృషిచేయాలి'

నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్

తిరుమలాయపాలెం, జూన్ 24: విద్యార్థుల్లో విద్యా ప్రమాణాల పెరుగుదలకు వసతి గృహ సంక్షేమ అధికారులు కృషి చేయాలని తహసీల్దార్ రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్‌లో సోమవారం సాయంత్రం బాలికలకు దుస్తులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హాస్టల్ బాలికలు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

మధిర మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా వేణు

మధిర, జూన్ 24: మధిర మున్సిపాలిటీ కమిషనర్ షఫిఉల్లా సెలవుపై వెళ్లడంతో వైరా మున్సిపాలిటీ కమిషనర్ వేణుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో మధిర మున్సిపాలిటీలో వేణు సోమవారం బాధ్యతలు చేపట్టారు. కమిషనర్‌ను మున్సిపల్ అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్షయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **సత్తుపల్లి బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **ఒగ్గు అనంత్ రెడ్డి**, S/o : **వెంకటరెడ్డి, వయస్సు :** 40 సం॥లు, **వృత్తి :** ప్రయివేటు ఉద్యోగం, **నివాసం :** ఇ.నెం. 48-209, సూర్యనగర్, యూనిక్ హైస్కూల్ దగ్గర, ఐ.డి.పి.యల్, కుత్బుల్లాపూర్, బాలాపూర్, మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, కైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **5** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు ప్రాతఫూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.
షెడ్యూలు ఆస్తి: జిల్లా రిజిస్ట్రారు మరియు జిల్లా పరిషత్ ఖమ్మం, వేంసూరు మండల పరిషత్, సత్తుపల్లి సబ్ రిజిస్ట్రారు వారి ఇలాఖా, కందుకూరు గ్రామ పంచాయితీ, కందుకూరు గ్రామ రెవిన్యూ రికార్డు దాఖలా కందుకూరు గ్రామంలో నా స్వాధీన యాజమాన్య అనుభవ హక్కు భుక్తములో వున్న 160 చ॥గ॥ల స్థలములో నా పేరుతో నిర్మించుకొన్న 4-105వ నెంబరు గల ఆర్.సి.సి. బిల్డింగ్ (Assessment No. 846), లెట్రిన్, బాత్‌రూమ్, మంచినీటి పంపు కనెక్షన్, కరెంటు సర్వీసు కనెక్షన్ యుక్తముగా, **డాక్యుమెంట్ నెం. 685/2024,** గల ఆస్తికి హద్దులు: **తూర్పు :** ఒగ్గు వెంకటరెడ్డి గారి స్థలము, **దక్షిణం :** రేగళ్ళ తిరుపతిరెడ్డి గారి స్థలము & ఇల్లు, ఇంటి నెం. 4-114, **పడమర :** గ్రామ పంచాయితీ రోడ్డు, **ఉత్తరం :** తెలగారపు అప్పారావు గారి నివేశన స్థలము.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొణిజర్ల, జూన్ 24: స్థానిక గిరిజన గురుకుల సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఖమ్మం ఆర్సీవో టీవీ రాజు, కళాశాల ప్రిన్సిపాల్ మానస సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తిచేసుకున్న విద్యార్థులు ఈ నెల 26న ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 9491063083, 9640947467 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

'పేదలకు ఇళ్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలి'

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

వేంసూరు, జూన్ 24: పేదలకు ఇందిరమ్మ ఇల్లు, రేషన్‌కార్డులు, పింఛను,ఇళ్ల పట్టాలు, సీసీరోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇల్లు వెంటనే పేదలకు ఇవ్వాలని, ఉపాధిహామీ పథకం పని చేసిన కూలీలకు డబ్బులు రాక ఇబ్బంది పడుతున్నారని వారికి డబ్బులు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

ఇంటర్ సప్లీ ఫలితాల్లో ప్రైవేటు విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 24: ఇంటర్ బోర్డు ప్రథమ సంవత్సరం ఇంప్రూవ్‌మెంట్/ సప్లమెంటరీ, ద్వితీయ సంవత్సరం సప్లమెంటరీ ఫలితాలు సోమవారం విడుదల య్యాయి. ప్రథమ సంవత్సరంలో 9,950 మందికిగాను 6,679 మంది, ద్వితీయ సంవత్సరంలో 3,982 మందికిగాను 1,807 మంది ఉత్తీర్ణుల య్యారు. ఇంప్రూవ్‌మెంట్‌లో ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు మార్కులు పెరిగినట్లు యాజమాన్యాలు తెలిపాయి.

ఆర్జేసీ విద్యార్థికి ప్రథమ స్థానం

ఆర్జేసీ కార్తీక్

ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో నగరంలోని ఆర్జేసీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారని చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. సీఈసీలో పి.కార్తీక్ 472 మార్కులతో జిల్లా ప్రథమ స్థానం సాధించాడు. ప్రిన్సిపాల్ లక్ష్మీపతి అభినందించారు.

శ్రీచైతన్య విద్యార్థులకు ఫస్ట్ మార్కులు

శ్రీచైతన్య విద్యార్థులతో డైరెక్టర్ శ్రీవిద్య

ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో నగరంలోని శ్రీచైతన్య కళాశాలకు చెందిన విద్యార్థులు ఫస్ట్ మార్కులు సాధించినట్లు చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య ఒక ప్రకటనలో తెలిపారు. వారు వెల్లడించిన వివరాలు.. ఎంపీసీలో 468 మార్కులతో సాయితేజ, సాకేత్, రిషిక, మణికీర్తి, ప్రణతి, వినీల, ఉత్తేజిత, గణేష్; బైపీసీలో 438 మార్కులతో రిషిత, గీతిక రాణించారు. 430 మార్కుల పైన సాధించిన వారు 50 మంది ఉన్నారు. వీరిని అకడమిక్ డైరక్టర్ బి.సాయిగీతిక, డీజీఎం చేతన్ మాథుర్, డీన్ వర్మ, ఏజీఎంలు చిట్టూరి బ్రహ్మం, ప్రకాష్, గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్స్ అభినందించారు.

న్యూవిజన్ విద్యార్థుల సత్తా..

న్యూవిజన్ విద్యార్థులతో చైర్మన్ ప్రసాద్

ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో నగరంలోని న్యూవిజన్ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారని చైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాలు.. ఎంపీసీలో 468 మార్కులతో లలనిక చౌదరి, ప్రణయ్; 467 మార్కులతో రుత్విక, శశాంక్, ఆశ్రిత, యోగిత, నిషిత, ప్రణతి, మనస్వి చౌదరి, స్నేహిత, రిషిత; బైపీసీలో 437 మార్కులతో సూర్యతేజ, 436 మార్కులతో గ్రీష్మ వెంకటరమ్య ప్రతిభ చాటారు. వీరిని డైరెక్టర్ గోపీ చంద్, అకడమిక్ డైరెక్టర్ కార్తీక్, ప్రిన్సిపాల్స్ అభినందించారు.

సప్లీ ఫలితాల్లో ప్రభుత్వ విద్యార్థులకు అద్భుత మార్కులు

ప్రభుత్వ విద్యార్థులు వై.భోషిత్‌రెడ్డి, ఎస్.మస్తాన్‌బీ, పీ.అఖిల, వీ.రాజ్‌కుమార్

ఎర్రుపాలెం, జూన్ 24: ఇంటర్ సప్లిమెంటరీ పలితాల్లో బనిగండ్లపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ప్రథమ సంవత్సరంలో 90 మంది విద్యార్థులకు 80 మంది ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 57 మంది విద్యార్థులకు 55 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో వై.భోషిత్‌రెడ్డి 464/470, బైపీసీలో ఎస్.మస్తాన్‌బీ 429/440, సీఈసీలో పీ.అఖిల 445/500, ఎంఈ గ్రూప్‌నందు వీ.రాజ్‌కుమార్ 449/500 మార్కులు సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

సత్తుపల్లి ప్రభుత్వ విద్యార్థుల హవా..

సత్తుపల్లి, జూన్ 24: ఇంటర్ సప్లమెంటరీ పరీక్షా ఫలితాల్లో కల్లూరు ప్రభుత్వ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ఎంపీసీ మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎం దుర్గాభవానీ 439/470, బైపీసీ విభాగంలో కే సుజాత 395/440, సీఈసీలో డీ అఖిల 375/500, హెచ్ఈసీలో కే ఉపేంద్ర 484/500 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్ తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

చింతకాని, జూన్ 24 : చికిత్స పొందుతూ వివాహిత మృతిచెందిన ఘటన మండల పరిధిలోని రామకృష్ణాపురంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అదే గ్రామానికి చెందిన మృతురాలు పత్తిపాటి వర్షిత (24) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నది. ఈ నెల 21 సాయంత్రం తీవ్రమైన కడుపు నొప్పి రాగా తాళలేక ఇంట్లో ఉన్న ఎలుకల మందు తాగింది. మృతురాలి భర్త సుమన్ హుటాహుటిన కుటుంబసభ్యుల సహకారంతో ఖమ్మం దవాఖానాకు తరలించగా చికిత్స పొందుతూ జూన్ 23 సాయంత్రం మృతిచెందింది. మృతురాలికి కుమారుడు ఉన్నారు. మృతురాలి తండ్రి రామచంద్రు ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ ఎంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్ అదృశ్యం

రఘునాథపాలెం, జూన్ 24: ఆటో డ్రైవర్ అదృశ్యంపై ఖానాపురం హవేలీ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ భానుప్రకాశ్ తెలిపిన వివరాలు.. ఖమ్మం నగరంలోని బాలప్పేట ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ ధరావత్ వెంకన్న (40) ఈ నెల 17న, భార్య ఇంట్లో లేని సమయంలో, తన మిత్రులతో కలిసి తిరుపతి వెళ్తున్నానని పిల్లలతో చెప్పి వెళ్లాడు. ఇంట్లో ఉన్న రూ.2లక్షలు తీసుకెళ్లాడు. ఆ రోజు నుంచి ఆయన ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉంది. ఆయన భార్య ప్రమీల అన్నిచోట్ల ఆరా తీసినప్పటికీ జాడ తెలియలేదు. ఆమె సోమవారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదైంది.

భూనిర్వాసితులకు రూ.10 కోట్ల పరిహారం

సత్తుపల్లిటౌన్, జూన్ 24: సీతారామ ప్రాజెక్టు యాతాలకుంట గ్రామ భూ నిర్వాసితులకు జిల్లా మంత్రులు, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి చొరవతో ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసింది. నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సీతారామ ప్రాజెక్టు యాతాలకుంట గ్రామ భూ నిర్వాసితులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే రాగమయి డిప్యూటీ సీఎం, మంత్రుల సహకారంతో సుమారు 100 మంది రైతులకు రూ.10 కోట్లు మంజూరు చేయించారు.

మేయర్ నివాళి

ఖమ్మం వ్యవసాయం, జూన్ 24: నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగంలో టీపీఎస్‌పీగా పనిచేస్తున్న ఇటికాల భాస్కర్ తండ్రి విశ్వనాథాచారి(85) సోమవారం తెల్లవారుజామున మృతి చెందా. భాస్కర్ మృతదేహాన్ని మేయర్ పి.నీరజ సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

రఘునాథపాలెం, జూన్ 24: నగరంలోని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంప్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మేయర్ పునకొల్లు నీరజ సోమవారం పంపిణీ చేశారు. నేతలు మురళి, రంగారావు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న మేయర్

గంజాయి కేసులో ముగ్గురికి పదేళ్ల జైలు

మామిళ్లగూడెం, జూన్ 24: గంజాయి కేసులో నేరస్తులుగా తేలిన ముగ్గురు నిందితులకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.50వేల చొప్పున జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.ఉమాదేవి సోమవారం తీర్పు ఇచ్చారు. ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్-1 సీఐ బి.కృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపిన వివరాలు.. ఖమ్మం నగరంలోని ఇందిరానగర్‌కు చెందిన పడిమల శివ, రోటరీ నగర్‌కు చెందిన బానోత్ లక్ష్మణ్, వైఎస్ఆర్ కాలనీకి చెందిన సంగెపు భాస్కర్ కలిసి 2022 మార్చి 28న ఖమ్మంలోని శ్రీశ్రీ సర్కిల్ వద్ద నాలుగు కిలోల గంజాయితో ఉండగా అప్పటి ఖమ్మం స్టేషన్-1ఎ క్సైజ్ సీఐ రాజు ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వరరావు, ఎస్ఐ వి.రవి పట్టుకున్నారు. వారి నుంచి గంజాయిని, బైక్‌ను స్వాధీనపర్చుకుని కేసు నమోదు చేశారు. నిందితులను కోర్టు ఆదేశంతో జైలుకు పంపించారు. ఎక్సైజ్ సీఐ కె.రాజు దర్యాప్తు పూర్తి చేశారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎల్.వేణుగోపాల్ రెడ్డి ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కోర్టులో చార్జిషీట్ ధాఖలు చేశారు. నేరం రుజువవడంతో పదేళ్ల కఠిన కారాగారం, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ.శంకర్ వాదనలు వినిపించారు. కోర్టు కానిస్టేబుల్ టి.మారేశ్వర్‌రావు, హోంగార్డ్ ఆయూబ్ సహకరించారు.

తల్లీకొడుకు ఆత్మహత్యాయత్నం

తల్లి మృతి.. చికిత్స పొందుతున్న కుమారుడు

ముదిగొండ, జూన్ 24: ఆర్థిక ఇబ్బందులతో తల్లీకొడుకు ఆత్మహత్యకు పాల్పడగా తల్లి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రఘునాథపాలెం చిమ్మపుడికి చెందిన కొనతాల నర్సమ్మ (55), ఆమె కుమారుడు శేషగిరి మండలంలోని సువర్ణాపురం శివారులో ఆదివారం మధ్యాహ్నం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం నర్సమ్మ మృతిచెందగా ఆమె కుమారుడి పరిస్థితి విషమంగా ఉన్నది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గజ్జెల నరేష్ తెలిపారు.

పురుగుమందు తాగిన వ్యక్తి ఆత్మహత్య

మామిళ్లగూడెం, జూన్ 24: ఇంటి యజమాని అవమానించాడంటూ ఓ వ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఖమ్మం త్రీటౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ రమేశ్ కథనం ప్రకారం.. ఖమ్మం శ్రీనివాస్‌నగర్‌కు చెందిన ఓ భవనంలో చింతకాయల నాగరాజు (48) కుటుంబం రెండు నెలలుగా అద్దెకు ఉంటోంది. ప్రైవేటు వ్యాపారం చేసే నాగరాజు కుటుంబ సభ్యులను ఇంటి యజమాని 'మీ ప్రవర్తన బాగాలేదు.. ఇల్లు ఖాళీ చేయండి' అంటూ ఆదేశించాడు. ఇంటి యజమాని తన భార్య గురించి అసభ్యంగా వ్యాఖ్యానించాడని అవమానంగా ఉందంటూ ఆదివారం సెల్ఫీ వీడియో తీసి నాగరాజు పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. కాగా, చికిత్స పొందుతూ నాగరాజు సోమవారం మృతిచెందాడు. దీనిపై మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు ఇంటి యజమాని గోళ్ల జనార్దన్‌రావుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్ అరెస్ట్

మామిళ్లగూడెం, జూన్ 24: అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్ హసన్‌ను సోమవారం ఖమ్మం టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ తెలిపిన వివరాలు.. సర్వేల్యాండ్ రికార్డ్స్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన అఫ్జల్‌హసన్, విజయనగర్ కాలనీలోని 303 సర్వే నంబర్‌లో ఉన్న ఏపూరి కోటేశ్వరికి చెందిన 1420 గజాలను మరికొంత మందితో కలిసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ వ్యవహారం బయటకు రావడంతో వివిధ సెక్షన్ల కింద కేసు నమోదైంది. అఫ్జల్‌హసన్‌ను పోలీసులు అరెస్ట్ చేసి, అదనపు మేజిస్ట్రేట్ కోర్టు నాయమూర్తి రజని ఎదుట సోమవారం హాజరుపరిచారు. ఆయనకు జూలై 5 వరకు న్యాయమూర్తి రిమాండ్ విధించారు. దీంతో అఫ్జల్‌హసన్‌ను జిల్లా జైలుకు పోలీసులు తరలించారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఘటనా స్థలంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ఎర్రుపాలెం, జూన్ 24: మండలంలోని వెంకటాపురానికి చెందిన గౌర్రాజు మహేశ్వరి అనే మహిళ మెడలో గొలుసును గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేసిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మహేశ్వరి తన భర్త రాంబాబుతో కలిసి గ్రామ సమీపంలోని వైన్‌షాపు దగ్గరలో తినుబండారాల దుకాణం నడుపుతున్నారు. సోమవారం ఆమె తన షాపు వద్ద ఉండగా గుర్తు తెలియని వ్యక్తి వెంకటాపురం వైపు నుంచి బైక్‌పై వచ్చి మహిళ మెడలో ఉన్న 40 గ్రాముల బంగారు గొలుసును లాక్కొని వెంటనే తన బైక్‌పై జమలాపురం వైపు పారిపోయాడు. మహిళ వెంటనే తేరుకొని లబోదిబోమంటూ వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటన స్థలాన్ని ఏసీపీ రెహ్మాన్, సీఐ మధు, ఎస్సై వెంకటేష్ పరిశీలించారు. దొంగ పారిపోయిన రూట్‌లో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

నాగులవంచ యువకుడికి బంగారు పతకం

పతకాలతో సింహాద్రి

చింతకాని, జూన్ 24 : మండల పరిధిలోని నాగులవంచ గ్రామానికి చెందిన చెట్టిపోగు సింహాద్రికి పరుగు పందెంలో బంగారు పతకం లభించింది. చెట్టిపోగు సింహాద్రి అగ్నివీర్ డిఫెన్స్ అకాడమీకి ఎంపికై కొంతకాలంగా శిక్షణ పొందుతున్నాడు. న్యూఢిల్లీలో ఫిట్ ఇండియా ఫెడరేషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేపాల్ దేశం ఫోకారా నగరంలోని ఫోకారా స్టేడియంలో నిర్వహించిన పరుగుపందెంలో ప్రథమ స్థానంలో నిలచి బంగారు పతకం, షీల్డ్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా సింహాద్రి మాట్లాడుతూ.. తన ఆర్మీ కోచ్, తల్లిదండ్రులు వీరబాబు, దేవమణి దంపతుల ప్రోత్సాహమే ఈ విజయం అని పేర్కొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ

ఎర్రుపాలెం, జూన్ 24: మండల పరిధిలోని బనిగండ్లపాడు గ్రామానికి చెందిన సుదర్శన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎలోహిమ్ ప్రార్థన మందిరంలో 25 మంది విద్యార్థులకు సోమవారం నోట్ పుస్తకాలు, పెన్నులను ఫాదర్ జగదీష్‌పాల్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుకునేందుకు తోడ్పాటు అందజేస్తున్నామన్నారు. సంఘస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అడవిమల్లెల పాఠశాలలో..

పెనుబల్లి, జూన్ 24: మండలంలోని అడవిమల్లెల గురుకుల పాఠశాల విద్యార్థులకు సోమవారం ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మందడపు అశోక్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు.

డంపింగ్‌యార్డ్‌ను పరిశీలించిన రైతు నేతలు

వైరా టౌన్, జూన్ 24: వైరా రిజర్వాయర్ ఆయకట్టుకు సాగునీరు అందించే పంట కాల్వలు డంపింగ్‌యార్డ్‌ను తలపిస్తున్నాయని, మున్సిపాలిటీ అధికారులు పంట కాల్వల్లో డంపింగ్‌యార్డ్‌గా మార్చకుండా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ రైతు సంఘం బృందం వైరా కుడి కాల్వపై ఇందిరమ్మ కాలనీ వద్ద చెత్తతో నిండిన కాల్వలు పరిశీలించింది. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా మున్సిపాలిటీ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదన్నారు.

'ధరలు పెంచడంలో మోదీకెవరూ సాటిలేరు'

చింతకాని, జూన్ 24 : ప్రధాని మోదీ చారిత్రక, ప్రభుత్వరంగ సంస్థలను, దేశ సంపదను కార్పొరేట్లకు అప్పనంగా దోచిపెడుతున్నాడని, ధరలు పెంచడంలో మోదీకి సాటిలేరని సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు మన్నేపల్లి సుబ్బారావు అన్నారు. సోమవారం సీపీఎం మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాజకీయ శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, వాటిని నియంత్రించకుండా ప్రధాని పదవిలో ఉంటూ కులాలు, మతాల పేరిట రాజకీయాలు చేయడం దురదృష్టకరమని అన్నారు.

మడుపల్లి పాడి రైతులకు అవగాహన సదస్సు

మధిర రూరల్, జూన్ 24: మండల కేంద్రంలోని మడుపల్లి గ్రామంలో సోమవారం హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ పాల డైరీ వారి ఆధ్వర్యంలో పాడి రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. హైదరాబాద్ 2 రీజనల్ ఇంచార్జి వరప్రసాద్, ఏరియా మేనేజర్ జ్యోతిషరెడ్డి, వెటర్నరీ డాక్టర్ డైరీ మేనేజర్ దిరిసల గోపి, రూట్ మేనేజర్ చెరుకూరి సురేష్, ప్లాంట్ ఆపరేటర్ పూట్ల నవీన్, పిఎన్ఆర్ డైరీ ఓనర్ పుచ్చకాయల వెంకటనారాయణ, డైరీ ఓనర్ జల ప్రవీణ్, పుచ్చకాయల గాంధీ, పంగా శేషగిరిరావు, దూపాటి అనిల్, ఎర్రమల రామకృష్ణారెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, పాడి రైతులు పాల్గొన్నారు.

సత్తుపల్లి కోదండ రామాలయ స్వర్ణోత్సవం

సత్తుపల్లి టౌన్, జూన్ 24: సత్తుపల్లిలోని శ్రీకోదండ రామాలయంలో ఈ నెల 22 నుంచి జరుగుతున్న స్వర్ణోత్సవ వేడుకలను సోమవారంతో ముగిశాయి. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శ్రీరామ పట్టాభిషేకం, క్రతువును అంగరంగ వైభవంగా జరిపారు. బీజేపీ నాయకుడు తాండ్ర వినోద్‌రావు పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు.

పెద్ద వెంకన్న మృతికి సీపీఎం నేత నివాళి

ఖమ్మం రూరల్, జూన్ 24: మండలంలోని కాచిరాజుగూడెనికి చెందిన సీపీఎం నాయకుడు అద్దంకి పెద్ద వెంకన్న (60) ఆదివారం రాత్రి పొలం వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందడం బాధాకరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. కాచిరాజుగూడెంలో వెంకన్న మృతదేహాన్ని సీపీఎం నేతలు పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావులతో కలిసి సోమవారం తమ్మినేని సందర్శించారు. ఎర్రజెడా కప్పి నివాళి అర్పించారు.

ప్రభుత్వ పాఠశాలల సందర్శన

వైరా రూరల్, జూన్ 24: మండలంలో ప్రమోషన్